క్లుప్తంగా

దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న మానసిక దివ్యాంగులు

డాబాగార్డెన్స్ : సంఘ సేవకుడు రవిశంకర్‌రెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కొత్తవలస సమీపంలో గల చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న 65 మంది మానసిక వికలాంగులకు రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు రెడ్డి రమాదేవి, చిహీర్, మయూఖ్, బాదిరెడ్డి పైడితల్లమ్మ, కచ్చాల రమణమ్మ, రాము, బాదిరెడ్డి కృష్ణ(గోపి), వెంకట నాగలక్ష్మి, బాదిరెడ్డి జగన్నాథరావు, పద్మ, ఎస్‌వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



ప్రేమ సమాజంలో పిల్లలతో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

మహారాణిపేట : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం, మెంటల్ కేర్ ఆస్పత్రిలో ఆమె పర్యటించి ట్రాఫిక్ అవగాహనపై వివరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎం కోర్టు జడ్జి జి.స్వర్ణ, ఎండీఎం కోర్టు జడ్జి సూర్యకళ తదితరులు పాల్గొన్నారు. ప్రేమ సమాజంలో ఉన్న వృద్ధులు, పిల్లలతో మాట్లాడి వసతి, భోజన సదుపాయాల ఆరా తీసి పలు సూచనలు చేశారు. సాగర్‌నగర్ అంధుల పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు వసతి, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శేషమ్మ పలు సూచనలు చేశారు.

నాయకత్వంతో విద్యార్థుల్లో బాధ్యత



విద్యార్థులకు పత్రాలు అందిస్తున్న కమాండర్ జోషి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్

ఆరిలోవ: నాయకత్వం విద్యార్థుల్లో బాధ్యత పెంచుతుందని సెకెండ్ ఇన్ కమాండర్ 56 ఐటీబీపీ సూరత్ ప్రకాష్ జోషి తెలిపారు. విశాఖ వ్యాలీలో శుక్రవారం నాయకత్వ బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ కొన్ని విభాగాలకు విద్యార్థులను నాయకులుగా ఎంపిక చేశారు. క్రమశిక్షణ, సాంస్కృతిక, పాఠశాల తదితర విభాగాలకు ఎంపిక చేసిన నాయకుల(కెప్టెన్)కు జోషి, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం : పలు రైళ్లు ఆలస్యంగా చేరుకోవడంతో.. ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరే రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. షాలిమర్–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (12841) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 3 గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–భువనేశ్వర్(12829) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు బయలుదేరింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వర్షా కాలంలో దోమల నిర్మూలన తప్పనిసరి
- డెంగ్యూ వ్యతిరేక మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక ర్యాలీ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం : వర్షా కాలంలో దోమల నివారణ పట్ల అప్రమత్తంగా ఉండాలని 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి అన్నారు. వర్షా కాలంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉన్నందున మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ వ్యతిరేక మహోత్సవాల సందర్భంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ వర్షా కాలంలో వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. లేని ఎడల దోమలు వృద్ధి చెందడం వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని తెలిపారు. మండల విద్యాశాఖాధికారి పైడంనాయుడు మాట్లాడుతూ పిల్లలు అందరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీఎస్ నాగభూషణం మాట్లాడుతూ పిల్లలు ప్రతి రోజు కాచిన నీరు చల్లార్చి తాగాలని సూచించారు. పరిశుభ్రమైన దుస్తులు ధరించాలన్నారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా డెంగ్యూ నివారణ– ఉత్తమ రక్షణ అంటూ నినదిస్తూ ఎంజీఎం హైస్కూలు నుంచి వెంకటేశ్వరమెట్ట, నీలమ్మ వేపచెట్టు, బంగారుమెట్ట తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు.

32వ వార్డులో..

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. డెంగ్యూ నివారణ వారోత్సవాల్లో భాగంగా వార్డు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం వార్డులో డయేరియా వ్యాధి ప్రబలతుందన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలలో మూడు చెత్తబుట్టల విధానాన్ని వివరిస్తూ వేసిన రంగవల్లిక



ర్యాలీలో పాల్గొన్న ముఖ్య అతిథులు, విద్యార్థులు

అవగాహనతోనే వ్యాధుల నిర్మూలన



ఇసుకతోట ఏరియాలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు పర్యటించారు. ఇసుకతోట రామాలయం వీధి పరిసర ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. స్టాప్ డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు డీఎంహెచ్‌వో సూచించారు. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఇంట్లోని ఫ్రిజ్ వెనక ఉండే నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. రక్తహీనత నివారణ కోసం గర్భిణులను గుర్తించి ఐరన్ మాత్రలు అందజేయాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు డీఎంహెచ్‌వో సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి శుక్రవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) నాయకులు టి. నూకరాజు, ఉరుకూటి రాజు, పలువురు యూనియన్ నాయకులు అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌తో చర్చించారు. గత ఏడాది డిసెంబర్ 26 నుంచి ఈ ఏడాది జనవరి 10 వరకు పెండింగ్ సమస్యల పరిష్కారానికి సమ్మె చేసిన నేపథ్యంలో ఉద్యోగులకు రూ.వెయ్యి బోనస్, బకాయి హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, పారిశుధ్య కార్మికులకు సగం మందికి రెయిన్ కోట్లు ఇచ్చారని, మిగిలిన ఫీల్డ్ వర్కర్లకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. అలాగే డెత్, 60 ఏళ్ల పైబడిన, సిక్ పోస్టులు భర్తీ చేయాలని, 2005లో జీవీఎంసీలో విలీనమైన కార్మికులకు 13 నెలల ఈఎస్ఐ, పీఎఫ్ కట్ చేసిన సొమ్ము చెల్లించాలని, కార్మికులకు సేఫ్టీ పరికరాలు, సబ్బులు, నూనెలు, యూనిఫామ్స్ ఇవ్వాలని, నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు ఈఎస్ఐ, ఈపీఎస్ తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



సివిల్స్ ర్యాంకర్ చిట్టి రాజును అభినందిస్తున్న పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ జేమ్స్ స్టీఫెన్

మహారాణిపేట: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం పూర్వ విద్యార్థి కొయ్యే చిట్టి రాజు సివిల్ సర్వీసు పరీక్షల్లో 833వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా ఆయనను ఏయూ పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ తన కార్యాలయంలో అభినందించారు. 2011 నుంచి 2015 సంవత్సరంలో చిట్టి రాజు ఏయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అనంతరం సివిల్ సర్వీసెస్‌పై ఆసక్తితో యూపీఎస్సీ పరీక్షలు రాసి జాతీయ స్థాయిలో 833వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. త్వరలో శిక్షణకు వెళ్లనున్న ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఆచార్యులు, ప్లేస్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

గురుకులంలో మొక్కల పెంపకం



శ్రీకృష్ణాపురం గురుకులం ఆవరణలో మొక్కలు నాటుతున్న హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులం ఆవరణలో హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ ఆధ్వర్యంలో శుక్రవారం పచ్చదనం కోసం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. 'స్వచ్ఛ పఖ్వాడా నెల'సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కడ ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఆర్ట్ పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ప్రతిభ చాటగా వారికి బహుమతులు అందజేశారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజర్ రవికాంత్, రీజనల్ చీఫ్ మేనేజర్ సుందర్‌రావు, పాఠశాల ప్రిన్సిపాల్ రత్నవల్లి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్లను సన్మార్గంలో నడపాలి



మాట్లాడుతున్న ఏయూ ఆర్ట్స్, కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు

మహారాణిపేట : జాతీయ సేవా పథక ప్రోగ్రామ్ అధికారులు వలంటీర్లను సన్మార్గంలో నడపాలని, సోషల్ మీడియాకు వారు బానిసలు కాకుండా చూడాలని ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథక సెమినార్ హాల్లో విజయనగరం, ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రోగ్రామ్ అధికారుల ఒక రోజు శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దోమలపై దండయాత్ర, స్వీప్, ముఖ్యమైన దినోత్సవాల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కలిగించడం తదితర కార్యక్రమాల్లో జాతీయ సేవా పథక వలంటీర్ల పాత్ర మరువలేనిదన్నారు. వలంటీర్లు ఓటర్లను జాగృత పరచడం వల్లే ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జాతీయ సేవా పథక ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత కార్యక్రమాల్లో రక్తదానం, జాతీయ, అంతర్జాతీయ యువజన కార్యక్రమాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయ వలంటీర్లు ముందున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథక విశాఖ జిల్లా ప్రొగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రొగ్రామ్ అధికారి జి.చంద్రశేఖర్ ప్రసంగించారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



ర్యాలీలో పాల్గొన్న శ్రామిక్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) పిలుపు మేరకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ జరిగింది. విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, యూనియన్ నాయకులు హాజరై నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ కో–ఆర్డినేటర్ పి.రామ్మోహనరావు మాట్లాడుతూ ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా నాయకత్వంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.కె.పట్నాయక్ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఏఐఆర్ఎఫ్ జోనల్ కార్యదర్శి బి.దామోదరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకుంటే 1972లో చేసిన విధంగా సమ్మె చేసేందుకు సిద్ధమన్నారు. ర్యాలీ అనంతరం ప్రధాని మోదీకి రాసిన వినతిపత్రాన్ని వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు అందజేసి.. ప్రధానికి పంపాలని కోరారు. జోనల్ అధ్యక్షుడు పి.వి.జి.రాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

పరవాడ: ప్రభుత్వం సరఫరా చేసే నోట్ పుస్తకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నారాయణరావు కోరారు. కళాశాలలో చదువుతున్న 316 మంది విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన నోట్ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. త్వరలో విద్యార్థులకు బ్యాగు, పాఠ్య పుస్తకాలను అందజేయనున్నామని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. తదుపరి సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు. ● శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వివాహిత అదృశ్యం



భవానీ (ఫైల్)

అల్లిపురం: తన భార్య కనిపించడం లేదని అల్లిపురం, గాంధీబొమ్మ జంక్షన్‌కు చెందిన ఎస్.సురేష్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. గత ఏడాది డిసెంబర్ 24న సురేష్ పనికి వెళ్లారు. రాత్రి ఇంటికి చేరుకోగా అతని భార్య ఎస్.భవానీ కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంది. అప్పటి నుంచి నగరం, బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో ఆయన శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 92941 06386, 9440 904716కు తెలియజేయాలని సీఐ కోరారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

శాకంబరిగా వారాహి మాత

అల్లిపురం: అల్లిపురంలోని శ్రీ షిర్డీ సాయి దర్బార్‌లో వెలసిన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఏడవ రోజు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారాహి అమ్మవారిని కాయగూరలతో శాకాంబరీ దేవిగా అలంకరించారు. దీంట్లో భాగంగా మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని వారాహి స్తోత్రంతో కీర్తించారు. ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకాంబరి అవతారంలో వారాహి మాత



హెల్మెట్ ధారణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శేషమ్మ

డాబాగార్డెన్స్ : హెల్మెట్‌ధారణ.. హెల్మెట్ ఆవశ్యకతపై శుక్రవారం ద్వారకా బస్ స్టేషన్‌లో విశాఖ జిల్లా న్యాయ సేవా అథారిటీ నేతృత్వంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి శేషమ్మ హెల్మెట్ వాడకం ఆవశ్యకత గురించి తెలిపారు. గత ఏడాది 4700 యాక్సిడెంట్లు జరిగితే అందులో 4100 యాక్సిడెంట్లకి ప్రధాన కారణం హెల్మెట్ సరిగ్గా వినియోగించకపోవడమే అని చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వారి డ్రైవింగ్ లైసెన్స్ 3 నెలల పాటు రద్దు చేయబడుతుందని తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అన్ని ఆర్టీసీ డిపోల్లో నిర్వహిస్తామని తెలిపారు.

డోలు కళాకారుడు గోవిందరావుకు సత్కారం



గోవిందరావు దంపతులను సత్కరిస్తున్న ఎం.వి.రాజశేఖర్, సంఘ సభ్యులు

సీతంపేట: విశాఖ నగర శ్రీమారుతి నాయీ బ్రాహ్మణ డోలు, సన్నాయి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డోలు వాయిద్యంలో ఆల్ ఇండియా రేడియో ద్వారా ఏ టాప్ గ్రేడ్ పొందిన కళాకారుడు కె.గోవిందరావును శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ ఏ కళాకారుడైన తను ఎంపిక చేసకున్న కళలో రాణించాలంటే దీక్ష, పట్టుదల, కృషితోనే సాధ్యమవుతుందన్నారు. కె.గోవిందరావు దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. సాటి కళాకారుని ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేలా సత్కార కార్యక్రమాన్ని నిర్వహించిన సంక్షేమ సంఘం సభ్యులను ప్రశంసించారు. కార్యక్రమంలో జి.శ్రీమన్నారాయణ, సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.భీమారావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి బాలరాజు, మెలోడి క్రియేటర్స్ అధ్యక్షులు సిహెచ్.వి.సత్యనారాయణ, సంక్షేమ సంఘం సభ్యులు, నాదస్వర డోలు కళాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీ కొనడంతో డ్రైవర్ గండ్రేడి నూరాజు (36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టు మార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గండ్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

నేడు శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి వెంకయ్యనాయుడు

అక్కిరెడ్డిపాలెం : మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి శనివారం ఉదయం 6 గంటలకు విచ్చేయనున్నట్లు దివ్యక్షేత్రం ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని దివ్యక్షేత్రం ప్రతినిధులు తెలిపారు. వెంకయ్యనాయుడుకు ఎస్టీబీఎల్ ప్రాజెక్ట్స్ అధినేత గుత్తికొండ బాలాజీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు.